


పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లెలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో జరుగుతున్న పనులు

గత వైసీపీ ప్రభుత్వం.. సంక్షేమ వసతి గృహాల నిర్వహణను గాలికొదిలేసింది. ఐదేళ్లపాటూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. దీంతో ఏ వసతి గృహంలో చూసినా విరిగిపోయిన మరుగుదొడ్ల బేసిన్లు.. కిటికీలకు అడ్డుగా కట్టిన పరదాలు.. ఆరుబయట స్నానాలు కనిపించేవి. ప్రహరీలు లేనిచోట్ల విషపురుగుల సంచారంతో విద్యార్థులు భయం.. భయంగా గడిపేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వసతి గృహాల్లోని విద్యార్థుల సంక్షేమంపై దృష్టి పెట్టింది. మరోవైపు కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా ప్రత్యేక చొరవ తీసుకుని మరమ్మతులకు అవసరమైన నివేదికలను ప్రభుత్వానికి పంపడంతో నిధులు విడుదలయ్యాయి.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

కూటమి ప్రభుత్వ హయాంలో బాగుపడుతున్న సంక్షేమ వసతి గృహాలు

మరమ్మతులకు రూ.11.83 కోట్ల విడుదల

హాస్టళ్లకు మంచి రోజులు



గంగాధరనెల్లూరులోని ఎస్సీ బాలికల వసతి గృహానికి వేసిన రంగులు

జిల్లాలోని నగరి, జీడీనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో మొత్తం 57 (41 ప్రీమెట్రిక్, 16 పోస్టుమెట్రిక్) వసతి గృహాలున్నాయి. వీటిల్లో రెండు వసతి గృహాలు బాగున్నాయి. ఏడు ప్రైవేటు భవనాల్లో నడుస్తున్నాయి. మిగిలిన 48 వసతి గృహాల్లో పనులు మొదలయ్యాయి. వీటిల్లో మూడో తరగతి నుంచి డిగ్రీ, ఆపై కోర్సుల్లో 3,500 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. కలెక్టర్‌గా సుమిత్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నాక కుప్పం తదితర ప్రాంతాల్లోని వసతి గృహాలను పరిశీలించారు. సరైన వసతుల్లేక ఇబ్బంది పడటాన్ని గమనించారు. మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నివేదికలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ నివేదికలను ప్రభుత్వానికి కలెక్టర్ పంపగా నిధులు విడుదలయ్యాయి.

జరుగుతున్న పనులు

48 వసతి గృహాల్లో మరమ్మతులకు రూ.11.83 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆరు నియోజకవర్గాలకు కలిపి రూ.8.83 కోట్లను, కుప్పానికి మాత్రం రూ.3కోట్లను కేటాయించింది. ఈ నిధులతో స్నానాలగదులు, మరుగుదొడ్లు, కిటికీలు, మెష్, ఫ్యాన్లు, వాటర్ పైపులు, డోర్లకు మరమ్మతులు, అవసరమైన చోట్ల ప్రహరీల నిర్మాణం, రంగులు వేయడం, సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్, వైరింగ్, ఫ్లోరింగ్, పిచ్చి మొక్కల తొలగింపు, బోరు మోటర్ల రిపేర్లు తదితర పనులు చేస్తున్నారు.

ఐదు శాఖలకు పనులు అప్పగించిన కలెక్టర్

సాధారణంగా జిల్లా అంతటికీ కలిపి ఒకే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించేవారు. వారు నెలల తరబడి పనులు చేయడం, నాణ్యత లేకపోవడంతో ఏడాదిలోనే మళ్లీ మరమ్మతులకు గురయ్యేవి. ఈ సమస్యలన్నింటినీ గమనించిన కలెక్టర్ ఈ పనులను సోషియల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, సమగ్ర శిక్ష (ఎస్ఎస్) శాఖలకు అప్పగించారు. ఒక్కో మండలంలోని వసతి గృహాల పనులను ఒక్క శాఖ మాత్రమే చేయాలి. ఆ పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఇంజనీరింగ్‌శాఖ అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు మాత్రం పుంగనూరు, చిత్తూరు నియోజకవర్గాల్లో పనులను అప్పగించారు. ఈ పనులు జరిగేచోట ఏఈ స్థాయి అధికారి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం

ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో వసతి గృహంలో వందమంది విద్యార్థులు ఉండాలి. ఈ లెక్కన 57 వసతి గృహాల్లో 5,700 మంది విద్యార్థులు ఉండాలి. కానీ 3,500 మంది మాత్రమే ఉన్నారు. దీనికి కరోనా ఓ కారణమైతే.. మౌలిక వసతులు లేకపోవడం మరో కారణంగా ఆ శాఖలో పనిచేసే ఓ అధికారి చెప్పారు. వసతి గృహాల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తే.. విద్యార్థుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందనడంలో ఎటువంటి సందేహమూ అక్కర్లేదు.

మార్చిలోగా పనులు పూర్తి చేస్తాం



కలెక్టర్ ప్రత్యేక చొరవతో వసతి గృహాల రూపురేఖలు మారుతున్నాయి. మౌలిక సదుపాయాలు కల్పించే పనిలో ఉన్నాం. మార్చి చివరినాటికి అన్ని పనులు పూర్తి చేస్తాం.

- చెన్నయ్య, డీడీ, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ



క్రాల్‌ను పరిశీలిస్తున్న చిరంజీవ్ చౌదరి



పలమనేరు సమీపంలోని మొసలిమడుగు వద్ద నిర్మించిన ఎలిఫెంట్ ఎన్‌క్లోజర్

'ఎలిఫెంట్ క్యాంపు'ను

త్వరగా సిద్ధం చేయండి

- పీసీసీఎఫ్ చిరంజీవ్ చౌదరి

పలమనేరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని మొసలిమడుగు వద్ద కుంకీ ఏనుగుల విడిది కోసం ఏర్పాటు చేస్తున్న ఎలిఫెంట్ క్యాంపును త్వరగా సిద్ధం చేయాలని పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) చిరంజీవ్ చౌదరి ఆదేశించారు. ఆదివారం ఎలిఫెంట్ క్యాంపు స్థలంలో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా క్యాంపు చుట్టూ అటవీప్రాంతంలో ఉన్న ఏనుగులు లోనికి రాకుండా తవ్వుతున్న కందకాలను పరిశీలించారు. ఏనుగుల కోసం ఏర్పాటు చేసిన నీటికుంటను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మదపుటేనుగులను అదుపు చేసేందుకు నిర్మించిన క్రాల్‌ను కూడా పరిశీలించారు. క్యాంపు చుట్టూ కందకాలకు అనుబంధంగా సోలారు విద్యుత్ కంచె నిర్మాణం వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. చిత్తూరు డీఎఫ్‌వో భరణి, పలమనేరు రేంజర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



పరుగు తీస్తున్న కోడెగిత్త

రంకేసిన

కోడెగిత్తలు

- పాతగుంటలో జల్లికట్టు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పాతగుంటలో ఆదివారం జల్లికట్టు జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి గ్రామానికి కోడెగిత్తలను తీసుకొచ్చారు. జనం కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. కోడెగిత్తల కొమ్ములకు పట్టీలను కట్టి అల్లిలోకి వదిలారు. పలువురు యువకులు వీటిని నిలువరించడానికి పోటీ పడ్డారు. కొందరికి గాయాలయ్యాయి. మరోవైపు ఈ సన్నివేశాలను మేడలు, గోడలు ఎక్కి జనం వీక్షించారు.



కోడెగిత్తను నిలువరిస్తున్న యువకులు

● నేడు

కలెక్టరేట్‌లో 'పీజీఆర్ఎస్'

చితూరు అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు. అలాగే ఆయా మండల, నియోజకవర్గాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, వారి సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు.

ఇంటర్ జనరల్ ప్రాక్టికల్స్ ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 28 సెంటర్లలో ఇంటర్మీడియట్ జనరల్ ప్రాక్టికల్స్ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి సయ్యద్‌మౌల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజి సబ్జెక్టుల్లో సుమారు 7,800 మంది హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీ వరకు జరిగే ప్రాక్టికల్స్‌కు అత్యధికంగా ప్రైవేటు కళాశాలల్లో సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

10 మద్యం దుకాణాలకు లాటరీ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిల్లాలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన 10 మద్యం దుకాణాలను సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ మీటింగ్ హాల్‌లో కలెక్టర్ సమక్షంలో ఎక్సైజ్ అధికారులు లాటరీ ద్వారా పారదర్శకంగా దుకాణాల కేటాయిస్తారు. ఓ వ్యక్తికి ఒక దుకాణం మాత్రమే కేటాయిస్తారు. 10 మద్యం దుకాణాలకు 79 దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో.. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు 13, చిత్తూరు రూరల్ మండలానికి 14, నగరి మున్సిపాలిటీకి 11, పలమనేరుకు 5, పుంగనూరుకు 8, గుడిపల్లెకి 16, పాలసముద్రానికి 6, వి.కోటకు 2, పెద్దపంజాణికి 1, వెదురుకుప్పానికి 3 ఉన్నాయి.

వరసిద్ధుడి సేవలో హైకోర్టు సీజే



జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కి జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, హైకోర్టు చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ కుటుంబ సమేతంగా ఆదివారం సాయంత్రం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వీరిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి.. స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరావు, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ మహేష్‌కుమార్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఎస్ఐ ధరణీధర పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలను పెంచుకోండి

- ఏఆర్ సిబ్బందికి ఎస్పీ మణికంఠ పిలుపు -

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని ఏఆర్ సిబ్బందికి ఎస్పీ మణికంఠ పిలుపునిచ్చారు. పోలీసు పరేడ్ మైదానంలో ఏఆర్ సిబ్బందికి జరుగుతున్న మొబిలైజేషన్ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ.. 15 రోజులుగా ఏఆర్ సిబ్బంది, అధికారులు.. పరేడ్ నిర్వహణ, వీఐపీ సెక్యూరిటీ, తదితరాలపై మరోసారి శిక్షణ తీసుకున్నారని తెలిపారు. ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాషా, ఎంటీవో భాస్కర్, హోంగార్డు ఆర్ఐ చంద్రశేఖర్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. శిక్షణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది, అధికారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఏఎస్పీ రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మణికంఠ

ఫటాఫట్



వైసీపీ హయాంలో నిస్తేజంగా మారిన ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు అభివృద్ధి పనుల్ని చేపడుతోంది. కుప్పం నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజ ఏర్పాటు, అక్కడే ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పునరుద్ధరించడం, రూ.10 కోట్ల వేర్వేరు నిధులతో తాగునీటి సమస్యను పరిష్కరించే పనుల్ని చేస్తోంది. ఆ శాఖలో జరిగే పురోగతిని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

ఇక కుప్పంలో భూగర్భ డ్రైనేజి

- ఎన్టీఆర్ సుజల స్రవంతీ పునరుద్ధరణ ● రూ.10 కోట్లతో తాగునీటి ఎద్దడి పరిష్కారం
- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్

కుప్పంలో భూగర్భ డ్రైనేజి సక్సెస్ అవుతుందా?

కుప్పం నియోజకవర్గంలోని మున్సిపాలిటీ మినహా నాలుగు మండలాల్లోనూ భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే రామకుప్పం మండల కేంద్రంలో 2018లో ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజి విజయవంతంగా నడుస్తోంది. ఇది కూడా సక్సెస్ అవుతుంది.

పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి?

రూ.110.21 కోట్లతో 451 పనుల్ని చేపడుతున్నాం. జనవరి 7వ తేదీన కుప్పంలో సీఎం చంద్రబాబు శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు. ఏప్రిల్‌లో పనులు ప్రారంభమవుతాయి. మండలానికో ప్రాజెక్టు చొప్పున నాలుగు ప్రాజెక్టులుగా పనులు చేపడతాం.

జిల్లాలో తాగునీటి ఎద్దడికి చేపడుతున్న చర్యలు?

రూ.3.73 కోట్ల ఎస్డీఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్)తో 118 గ్రామాలకు తాగునీటి సరఫరా పనులు చేస్తున్నాం. రూ.2.09 లక్షల జడ్పీ గ్రాంటుతో గ్రామాల్లో 62 చిన్నపాటి మరమ్మతు పనులు చేస్తున్నాం. అలాగే కుప్పం నియోజకవర్గంలో రూ.4.17 కోట్లతో 110 ఓవర్‌హెడ్ ట్యాంకుల్ని పునరుద్ధరణ చేపట్టాం.

ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం పునరుద్ధరిస్తారా?

గతంలో టీడీపీ ఉన్నప్పుడు కుప్పం నియోజకవర్గంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ఉండేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ దాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కుప్పంలో ఇప్పుడు 9 మదర్ ప్లాంట్లు, 50 ప్లాంట్లు పనిచేస్తున్నాయి. రూ.10.27 కోట్లతో మొత్తం 16 మదర్ ప్లాంట్లు, 202 ప్లాంట్లను మళ్లీ పునరుద్ధరించనున్నారు.

- చిత్తూరు సిటీ, ఆంధ్రజ్యోతి

తిరుపతిలో ఆగని బాంబు బెదిరింపులు

- మరో రెండు హోటళ్లకు మెయిల్స్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటళ్లకు బాంబు బెదిరింపులు ఆగడంలేదు. హ్యూమన్ఐఈడీ బాంబు పేరుతో హోటళ్ల పేల్చేస్తామని, అందరూ బయటకు వెళ్లిపోవాలని బెదిరిస్తూ రీనెస్ట్, ఫై ఫ్రైస్రాయ్ హోటళ్లకు ఆదివారం మెయిల్స్ వచ్చాయి. యజమానుల ఫిర్యాదుతో అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి, బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు ఆయా హోటళ్లకు చేరుకున్నారు. పరిసర ప్రాంతాలు, గదులు, వంటగది.. ఇలా అణువణువు తనిఖీలు చేశారు. ఈ మెయిల్స్ అన్నీ కేరళ నుంచి వస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. కాగా, రెండ్రోజుల కిందట తిరుచానూరు సమీపంలోని గ్రాండ్‌రిడ్జ్.. అంతకుముందు తిరుపతి రూరల్ పరిధిలోని వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. నాలుగు నెలల కిందట ఈ రెండు హోటళ్లతోపాటు, మరో నాలుగింటికీ బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ప్రతిసారీ బాంబు, డాగ్ స్క్వాడ్లు తనిఖీలు చేసి ఎలాంటి బాంబులు లేవని తేల్చేస్తున్నారు.

పాఠశాలల్లో 'పరీక్షా పే చర్చ' పై నేడు ప్రత్యక్ష ప్రసారం

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సోమవారం 'పరీక్షా పే చర్చ' ప్రత్యక్ష ప్రసారం విద్యార్థులు వీక్షించేలా హెచ్‌ఎంలు చొరవ చూపాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలపై విద్యార్థుల్లో భయాందోళన పోగొట్టేందుకు ప్రధాని నరేంద్రమోదీ సోమవారం ఉదయం 11 గంటలకు ఢిల్లీ నుంచి 9వ తరగతి విద్యార్థులతో చేపట్టే 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం డీడీ నేషనల్, డీడీ న్యూస్, డీడీ ఇండియా, రేడియో చానళ్ల ద్వారా ప్రత్యక్షం కానుందన్నారు. ఈ ప్రసారాన్ని ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి టెన్త్ విద్యార్థులు టీవీల ద్వారా వీక్షించేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకొని విజయవంతం చేయాలన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

యాదమరి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ ఈశ్వర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓటివారిపల్లె పంచాయతీ కె.కొత్తూరు దళితవాడకు చెందిన ఎం.ఆర్. సురేష్ మూడు రోజుల క్రితం ఇంటినుంచి పనికోసం వెళ్లి తిరిగి రాలేదు. అతడి స్నేహితులు, బంధువుల వద్ద విచారించినా సురేష్ ఆచూకీ లభ్యంకాలేదు. ఆదివారం ఉదయం గ్రామసమీపంలోని బావిలో సురేష్ మృతదేహాన్ని చూసిన గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే సురేష్ మృతదేహాన్ని బయటకుతీసి పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సురేష్ సోదరుడు వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరి మృతి


పెరియస్వామి (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరుకు సమీపంలో శనివారం రాత్రి లారీ, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నూతన వధువరులతో పాటు 11మంది ఉండగా.. వీరిలో 10మందికి గాయాలై ఆస్పత్రి పాలైన సంఘటన తెలిసిందే. ఈ ప్రమాదంలో గాయపడ్డవారిలో అగరమంగళం దళితవాడకు చెందిన పెరియస్వామి(48) పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున సుమారు మూడు గంటల ప్రాంతంలో మృతిచెందాడు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


సెల్వకుమార్ మృతదేహం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మొగిలి సమీపంలోని గౌనివానిచెరువుకు ఈతకెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి గల్లంతైన సెల్వకుమార్ మృతదేహం ఆదివారం మధ్యాహ్నం లభ్యమైంది. బంగారుపాళ్యం సీఐ కత్తిశ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం నామక్కళ్‌కు చెందిన సెల్వకుమార్ (27) బంగారుపాళ్యం మండల పరిధిలోని ఫోడ్రాన్ కంపెనీలో కూలీగా పనిచేసేవాడు. స్నేహితులు ప్రశాంత్,శరవణన్, గోపినాథ్‌తో కలిసి ఈత కోసం సమీపంలోని గౌనివానిచెరువుకు వెళ్లి శుక్రవారం మధ్యాహ్నం గల్లంతయ్యాడు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ తెలియలేదు. ఆదివారం పలమనేరు అగ్నిమాపక అధికారులు, పోలీసులు, గజ ఈతగాళ్లు వచ్చి చెరువులో గాలించగా మధ్యాహ్నానికి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అమ్మో.. ఇంత పెద్ద క్రేనా..!


ఐదో అంతస్తుపైన భారీ క్రేన్ సాయంతో ఇనుప గడ్డర్లను అమరుస్తున్న కార్మికులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని నూతన జిల్లా కోర్టు భవన సముదాయ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఐదో అంతస్తు పైన షీట్లు వేయడం కోసం పెద్ద పెద్ద ఇనుప గడ్డర్లను అమర్చాల్సి ఉంది. ఇందుకోసం ఆదివారం బిల్డింగ్ కాంట్రాక్టర్ పెద్ద క్రేన్ తెప్పించి పనులు చేయిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌తోపాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి కోర్టు వైపు చూస్తే క్రేన్ చివరి భాగం కనిపిస్తుంది. ఇంత పెద్ద క్రేన్ చూసేందుకు కోర్టు ఆవరణకు చాలా మంది వస్తున్నారు. ఫొటోలు తీసుకుంటున్నారు. ఈ క్రేన్ సాయంతో 250 అడుగుల ఎత్తు వరకు, సుమారు 20 అంతస్తులకుపైగా పనులు చేస్తుంటామని దాని యజమానిని తెలిపారు. చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లో భవన నిర్మాణ పనులకు వెళుతుంటామన్నారు.

అలరించిన భక్తి గీతాలాపన


భక్తి గీతాలాపన చేస్తున్న చిత్తూరుకు చెందిన చిన్నారులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో కళానివేదన కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం చిత్తూరు చెందిన చిన్నారులు భక్తి గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పుష్కరిణిలో ఈ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు కాణిపాకంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్‌గా గోపీనాథ్ రెడ్డి



చిత్తూరు లీగల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్‌గా చిత్తూరుకు చెందిన కె.గోపీనాథ్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరులో జరిగిన న్యాయశాఖ ఉద్యోగుల సమావేశంలో నూతనకార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఒకే మాత్రతో ఆరోగ్యంగా..

- 1-19 ఏళ్ల పిల్లలు 3,63,888 మందిగా గుర్తింపు
- వీరంతా 'ఆల్బెండజోల్' వేసుకునే ఏర్పాట్లు
- నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం



జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం పోస్టర్

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో తరచుగా వచ్చే కడుపులో నొప్పికి నులిపురుగులు కారణమని పలు అధ్యయనాల్లో తేలినట్లు వైద్యులు చెబుతున్నారు. అందువల్ల ఆల్బెండజోల్ మాత్రను ప్రతి ఆరు నెలలకోసారి వైద్యుల పర్యవేక్షణలో ఇస్తే ఈ సమస్య నుంచి ఉపశమనం కలుగుతుందని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా 1-19 ఏళ్లలో పిల్లలంతా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

ఆరు నెలలకోసారి..

వసతి గృహాలు, పాఠశాలల్లో ఎంత శుభ్రంగా ఉన్నా కూడా ఒకరి నుంచి మరొకరికి నులి పురుగులు వ్యాపించే ప్రమాదం లేకపోలేదు. వీటిబారిన పడ్డ వారికి ఆకలి తగ్గిపోవచ్చు, తిన్నది సరిగా ఒంట పట్టకపోవచ్చు, నీళ్ల విరేచనాలూ పట్టుకోవచ్చు.. ఈ కారణాలతో చదువుపై ధ్యాస తగ్గిపోయే ప్రమాదమూ ఉంది. ఒకవేళ నులి పురుగులతో పేగుల్లో అడ్డంకులు ఏర్పడడం, మలద్వారం కిందికి జారడం వంటివి తలెత్తితే శస్త్ర చికిత్స చేయాల్సిన పరిస్థితికి దారి తీస్తుంది. కాబట్టి ప్రతి ఆరునెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్ర ఇవ్వాల్సి ఉంటుంది. దీన్ని అందరికీ ఒకేసారి ఇస్తే నులి పురుగులు వ్యాపించకుండా చూసుకోవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నులి పురుగుల నిర్మూలన మాత్రలు తప్పనిసరిగా కొన్ని పరిస్థితుల్లో వైద్య సిబ్బంది సూచన మేరకే వేయాలి. జబ్బుతో ఉన్నా, ఏవైనా ఇతర మందులు వాడుతున్న పిల్లలకు ఈ మాత్ర ఇవ్వడంలో జాగ్రత్తలు పాటించాలి. పిల్లలు మాత్రను ఒక గ్లాసు నీటితోపాటు నమిలి మింగాలి. తప్పనిసరిగా ఆరోగ్య కార్యకర్త సమక్షంలో వారి మార్గదర్శనంలోనే ఈ మాత్రను వినియోగించాలి.

1-19 ఏళ్లలోపున్న పిల్లల వివరాలిలా..

విద్యాసంస్థ	సంఖ్య	విద్యార్థుల సంఖ్య
అంగన్వాడీ కేంద్రాలు	2420	78924
ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు	2883	236691
ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలు	163	43787
బడిబయట పిల్లలు	-	4486
మొత్తం	**5466**	**3,63,888**

3,63,888 మందికి మాత్రలు

జిల్లాలోని 5,466 పాఠశాలలు, కళాశాలల్లో 3,63,888 మంది 1-19 ఏళ్లలోపువారిని గుర్తించాం. వీరందరితో సోమవారం మధ్యాహ్న భోజనం తర్వాత ఆల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకున్నాం. 1-2 ఏళ్ల వారికి సగం మాత్ర(200 ఎంజీ), 2-19 ఏళ్ల పిల్లలకు ఒక మాత్ర(400 ఎంజీ) వేయాలి. అన్ని పాఠశాలలు, అంగన్వాడీలు, కళాశాలల్లో అన్ని ఏర్పాట్లు చేశాం.

- కలెక్టర్, సుమిత్‌కుమార్

'సిట్' కార్యాలయంలో రోజంతా టెన్షన్ టెన్షన్

పోలీసుల ఉరుకుల పరుగులు - తమిళనాడు న్యాయవాదుల హడావిడి

కల్తీ నెయ్యి కేసులో అర్ధరాత్రి రెండు డెయిరీల డైరెక్టర్లు అరెస్టు - నిందితులకు నడిరోడ్డుపై గుర్తింపు పరీక్షలు


భూదేవి కాంప్లెక్సులోని సిట్ కార్యాలయం - వీధి లైట్ల వెలుతురులో నిందితులకు గుర్తింపు పరీక్షలు

తిరుపతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో సుప్రీంకోర్టు నియమించిన సిట్ బృందం కోసం కార్యాలయం ఏర్పాటైన తిరుపతి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్సులో ఆదివారం ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఏఆర్ డెయిరీ, వైష్ణవీ డెయిరీల డైరెక్టర్లను అరెస్టు చూపించే క్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఉరుకులు పరుగులు తీయడంతో సందడి నెలకొంది. దానికి తోడు తమిళనాడు, తిరుపతిలకు చెందిన న్యాయవాదుల హడావిడి కూడా కనిపించింది. కీలక నిందితుల అరెస్టు నేపథ్యంలో సిట్ అధికారులు, సిబ్బంది భోజనాలకు సైతం ఇళ్లకు వెళ్లకుండా కార్యాలయానికే తెప్పించుకున్న పరిస్థితి కనిపించింది.

సిట్ బృందానికి కార్యాలయం ఏర్పాటు చేసిన తిరుపతి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్సులోకి గత నవంబరు 23వ తేదీ నుంచీ ఇతరులను ఎవరినీ అనుమతించడం లేదు. చెక్‌పోస్టు కూడా ఏర్పాటుచేసి సిట్ సిబ్బందిని తప్ప ఇతరుల రాకపోకలపై ఆంక్షలు విధించారు. దీంతో ఈ ప్రాంతం శనివారం వరకూ ఎలాంటి హడావిడి లేకుండా కనిపించేది. ఆదివారం పరిస్థితి మారింది. ఉదయం నుంచే పోలీసు అధికారులు, సిబ్బంది రాకపోకలు పెరిగాయి. మధ్యాహ్నానికి ఏఆర్ డెయిరీ, వైష్ణవీ డెయిరీల డైరెక్టర్లను, ఇతర సిబ్బందిని పోలీసులు భూదేవి కాంప్లెక్సుకు తీసుకొచ్చారు. దాంతో ఆయా డెయిరీల అధికారులు, యజమానుల సన్నిహితులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఆపై తమిళనాడు, తిరుపతికి చెందిన న్యాయవాదులూ వచ్చారు. నిందితుల అరెస్టు నేపథ్యంలో రిమాండు రిపోర్టు తయారీలో పోలీసు అధికారులు మల్లగుల్లాలు పడ్డారు. కేసు దర్యాప్తు అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకట్రావు అక్కడే మకాం వేసి స్వయంగా రిమాండు రిపోర్టు రూపొందించారు. రాత్రి 8.20 గంటలకు రిపోర్టు సిద్ధం కావడంతో భారీ బందోబస్తు నడుమ నలుగురు నిందితులను వైద్య పరీక్షల నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించాక 9.10 గంటలకు తిరుపతి రాయలచెరువు రోడ్డులోని జడ్జిల నివాస సముదాయం వద్దకు తరలించారు.

నడిరోడ్డుపైనే గుర్తింపు పరీక్షలు: రాత్రి 9.10 గంటలకు నిందితులను జడ్జిల నివాస సముదాయం వద్దకు తీసుకురాగా వాహనాలను రోడ్డుకు ఇరువైపులా పార్కు చేసి జడ్జి అనుమతి కోసం పోలీసు అధికారులు నిరీక్షిస్తూ గడిపారు. రాత్రి 10.33 గంటలకు దర్యాప్తు అధికారి, అదనపు ఎస్పీ వెంకట్రావు, ఏపీపీ ఇరువురూ అక్కడికి చేరుకున్నారు. 11 గంటలకు జడ్జి ఎదుట నిందితులను హాజరు పరిచారు. అంతకు మునుపు జడ్జిల నివాస సముదాయం ఎదుట రోడ్డుపైనే నిందితులకు పోలీసు అధికారులు గుర్తింపు పరీక్షలు నిర్వహించారు. ఈఎస్ఐ ఆస్పత్రి గేటు వద్ద వీధి దీపాల కింద నిందితులను నిలబెట్టి గుర్తింపు చిహ్నాలు నమోదు చేశారు.

అర్ధరాత్రి రిమాండు: ఆదివారం రాత్రి 11 గంటలకు రెండో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ప్రవీణ్ కుమార్ ఎదుట నిందితులను హాజరుపరచగా వారికి 14 రోజుల పాటు ఆయన రిమాండు విధించారు. అనంతరం 11.30 గంటల సమయంలో నిందితులను పోలీసులు తిరుపతి సబ్ జైలుకు తరలించారు.



రిమాండు విధించాక నిందితులను వెలుపలకు తీసుకొస్తున్న పోలీసులు (ఇన్‌సెట్లో) జడ్జిల నివాస సముదాయం వద్ద సందడి

అట్టహాసంగా మైలారు పండుగ


జనసమూహం మధ్య పరుగులు తీస్తున్న కోడె గిత్త

రామకుప్పం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం అయ్యప్పగానిపల్లె గ్రామంలో ఆదివారం మైలారు పండుగ (ఎద్దుల పరుగు పందేలు)ను అట్టహాసంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా చూసేందుకు ఉదయం 6 గంటల నుంచే వేలాదిగా తరలివచ్చిన జనంతో గ్రామంలోని వీధులు జనసంద్రంగా మారాయి. ఉదయం 5 గంటలకు గ్రామస్థులు స్థానిక గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బరిలో తలపడనున్న దేవరెద్దులను ఊరేగించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు తమ పశువులను బరిలో పరుగులు తీయించారు. ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. పోటీల్లో సుమారు 250 ఎద్దులకు పైగా పాల్గొనగా గెలుపొందిన యజమానులకు మొదటి బహుమతిగా రూ.70,101, రెండో బహుమతిగా రూ.50,101, మూడో బహుమతిగా రూ.30,101, నాలుగో బహుమతిగా రూ.20,101, ఐదో బహుమతిగా రూ.15,101, ఆరో బహుమతిగా రూ.12 వేలు, ఏడో బహుమతిగా రూ.10 వేలు అందించారు. ఎంపీపీ సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు వెంకటరమణ, సురేష్, శంకరప్ప, సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్‌ఐ వెంకటమోహన్ పర్యవేక్షించారు.

జల్లికట్టుకు వెళ్లొస్తూ.. చెరువులో పడి యువకుడి మృతి


శ్రీనాథరెడ్డి (ఫైల్ ఫొటో)

వెదురుకుప్పం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జల్లికట్టు వెళ్లొస్తూ.. చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరి మండలం దోర్నకంబాలకు చెందిన శ్రీనాథరెడ్డి(39) తన స్నేహితులతో కలసి ఆదివారం వెదురుకుప్పం మండలం పాతగుంటలో జరిగిన జల్లికట్టుకు హాజరయ్యాడు. ఫూటుగా మద్యం తాగి మధ్యాహ్నం మూడు గంటలపైన తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో ఇద్దరు స్నేహితులతో కలిసి బ్రాహ్మణపల్లె సమీపంలో ఉన్న ఓ చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడ ఏం జరిగిందో ఏమో చెరువులోపడి గల్లంతయ్యాడని ఊరంతా తెలిసింది. వెదురుకుప్పం పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తమ సిబ్బందితో సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోయింది. అగ్నిమాపక కేంద్ర సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారొచ్చి సుమారు రాత్రి 8గంటల సమయంలో శ్రీనాథరెడ్డి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెదురుకుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుకు ప్రత్యేక గుర్తింపు కార్డు

- ఆధార్ తరహాలో 14 అంకెలతో ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రైతును ఆదుకోవడానికి ప్రభుత్వాలు అనేక పథకాలు, సేవలు ప్రవేశ పెడుతుంటాయి. అయినా ఎక్కడో ఓచోట రైతు అన్యాయమై పోతుంటాడు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే అడ్డంకులకు ఎందరో బలవుతుంటారు. వీటిని అధిగమించి పథకాలు, సేవలను సమర్థవంతంగా, పారదర్శకంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేసింది. ఇందులో భాగంగా ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. తర్వాత ప్రతి రైతుకూ ఆధార్ తరహాలో.. 14 అంకెలతో ప్రత్యేక గుర్తింపు కార్డు ఇవ్వాలని నిర్ణయించింది.

ప్రయోజనాలిలా..

పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ, రాయితీపై వ్యవసాయ పరికరాలకు తదితరాలను ఎవరి ప్రమేయం లేకుండా రైతు నేరుగా పొందే సౌలభ్యం ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు చేతికి అందకుంటే సత్వరమే నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చు. నీటి పారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి సేవలు రైతుకు నేరుగా అందుతాయి.

కార్డును ఎలా పొందాలంటే..

రైతులు ప్రత్యేక గుర్తింపు కార్డు కోసం రైతు సేవా కేంద్రాలకు వెళ్లాలి. ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకళ్లతోపాటు మొబైల్ నెంబరును గ్రామ వ్యవసాయ సహాయకుడికి అందించాలి. ఆ వివరాలను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ) ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రైతు మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఈ సంఖ్యను చెప్పడం ద్వారా వీఏఏ లాగిన్‌లో రైతు వివరాలు పరిశీలిస్తారు. 80 నుంచి వంద శాతం కచ్చితంగా 14 అంకెలతో కూడిన కార్డు ఓకే అవుతుంది. 60 నుంచి 80 శాతం వివరాలుంటే వీఆర్వో లాగిన్‌కు వెళ్తుంది. వివరాలు 40 నుంచి 60 శాతం మాత్రమే కచ్చితత్వం ఉంటే తహసీల్దారు లాగిన్‌కు వెళ్తుంది. ఆయా స్థాయిలో తప్పులను సరిచేశాక తిరిగి వీఏఏ లాగిన్‌కు పంపుతారు. ఆపై 14 అంకెలతో కూడిన కార్డు మంజూరు చేస్తారు.

రైతులు, సాగు విస్తీర్ణం వివరాలు

ఖరీఫ్‌లో సాగయ్యే విస్తీర్ణం	: 2,27,500 ఎకరాలు
పంట రకాలు	: 23
సాగు చేసే రైతుల సంఖ్య	: 2.20 లక్షలు
రబీలో సాగయ్యే విస్తీర్ణం	: 58,460 ఎకరాలు
పంట రకాలు	: 22
సాగు చేసే రైతుల సంఖ్య	: 36,028

'సీపీఆర్ మంగళ' అపార్ట్‌మెంట్ ప్రీ బుకింగ్ ప్రారంభం


సీపీఆర్ అపార్టుమెంట్ ప్రీ బుకింగ్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్లు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మంగళం పరిధిలో అధునాతనంగా నిర్మించిన 'సీపీఆర్ మంగళ' 2బీకే అపార్టుమెంట్ ప్రీ బుకింగ్‌ను ఎండీ కేవీ చలపతి ఆదివారం ప్రారంభించారు. కరకంబాడి రోడ్డులోని ఎంఆర్ఎఫ్ షోరూం ఎదురుగా సీపీఆర్ అపార్టుమెంట్ ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తోందన్నారు. ప్రీమియం లోకేషన్, మోడర్న్ డిజైన్, ఆర్కిటెక్చర్, సెక్యూరిటీ, సేఫ్టీ, పార్కింగ్, క్లబ్‌హౌస్, పార్కు, పాఠశాలలు, హాస్పిటల్స్, షాపింగ్‌మాల్స్‌కు అత్యంత సమీపంలో ఉందని వివరించారు. ఆరంభ ధర రూ.37 లక్షలుగా నిర్ణయించామన్నారు. వివరాలకు 9492013322/66/88 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ ప్రారంభోత్సవంలో డైరెక్టర్లు కాశీ, లోకేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ


క్యూలైన్లలో వేచియున్న భక్తులు

చౌడేపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి వివిధ అభిషేకాల అనంతరం స్వర్ణాభరణాలు, ప్రత్యేక పూలతో అలంకరించారు. కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన తిరుపతి పుస్తక ప్రదర్శన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చదవడం ద్వారా మంచి ఆలోచనలు కలుగుతాయని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ తెలియజేశారు. పది రోజులుగా తిరుపతిలో నిర్వహించిన 17వ తిరుపతి పుస్తక ప్రదర్శన ఆదివారం ముగిసింది. ఇస్కాన్ టెంపుల్ వద్దనున్న గ్రౌండ్‌లో భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనకు పలు రాష్ట్రాల నుంచి 70 స్టాళ్లు వచ్చాయి. విద్యా భవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు అధ్యక్షతన ఆదివారం సాయంత్రం సమాపనోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటకలోని దేవరాజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ అండ్ రీసెర్చ్ సంస్థ వీసీ డాక్టర్ వెంగమ్మ, రామకృష్ణ మిషన్ కార్యదర్శి సుకృతానంద, ఐజర్ డైరెక్టర్ సంతను భట్టాచార్య, సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ప్రసంగించారు.



కుప్పంలో జరిగిన టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం

ప్రజా సమస్యల పరిష్కారానికే 'జన నాయకుడు'

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం

కుప్పం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను గుర్తించి వాటిని సమూలంగా పరిష్కరించేందుకే జన నాయకుడు పోర్టల్‌తోపాటు పార్టీ కార్యాలయంలోని గ్రీవెన్స్‌సెల్ పనిచేస్తుందని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ స్థాయి విస్తృత పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జన నాయకుడు పోర్టల్, గ్రీవెన్స్ సెల్ పనితీరు, వీటిని ఉపయోగించుకునే విధానం తదితరాలపై పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఎస్ఎం మాట్లాడుతూ జనవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గంలో పర్యటించిన సమయంలో ఆయన స్థానిక ఎమ్మెల్యేగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి దాని కోసం ప్రత్యేకంగా యంత్రాంగాన్ని నియమించిన విషయం గుర్తు చేశారు. అంతేకాక జన నాయకుడు పేరుతో ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించారన్నారు. నియోజకవర్గంలోని ప్రజల నుంచి వివిధ మస్యలపై వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు వాటిని నేరుగా నివేదించి పరిష్కారం కోసం ఈ యంత్రాంగం పనిచేస్తుందన్నారు. నేరుగా సీఎంవోకు అనుసంధానమైన జన నాయకుడు పోర్టల్, గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన ప్రతి సమస్యను నిర్ణీత గడువులోపు అధికారులు పరిష్కరిస్తున్నారని చెప్పారు. జన నాయకుడు పోర్టల్, గ్రీవెన్స్ సెల్ గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, వారు ఈ యంత్రాంగాన్ని వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. అలాగే కార్యకర్తల సమస్యలు ఈ గ్రీవెన్స్ సెల్‌లో నివేదించుకోవచ్చని చెప్పారు. ముందుగా ప్రజల్లో మమేకమై, వారి కష్టనష్టాల గురించి తెలుసుకుని పరిష్కరించగలిగిన నాయకులకే పార్టీలో గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. అదే సమయంలో అటువంటి నాయకులకు, కార్యకర్తలకు ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుందన్నారు.

టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ జన నాయకుడు పోర్టల్ ప్రజా సమస్యల పరిష్కారానికి అద్భుత అవకాశమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా ప్రజల్లో చైతన్యం కలిగిస్తే వారి సమస్యలు పరిష్కారమై పార్టీపై విశ్వాసం పెరుగుతుందని, తద్వారా గ్రామ స్థాయిలో మరింత పట్టు దొరుకుతుందని సూచించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రస్తుత, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు భారతరత్న ఇవ్వాలి

● కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరిన రామచంద్రయాదవ్



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసిన రామచంద్రయాదవ్

పుంగనూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళా అభ్యున్నతికి విశేష కృషి చేసిన సావిత్రీబాయి పూలేకు ప్రతిష్ఠాత్మకమైన భారతరత్న అవార్డు ఇవ్వాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ కోరారు. ఆదివారం డిల్లీలోని అమిత్‌షా స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గత ప్రభుత్వ అవినీతి కుంభకోణాలు, అక్రమ కేసుల వ్యవహారాన్ని వెలికితీయాలని కోరారు. గత ప్రభుత్వం అనేక వర్గాలపై పెట్టిన అక్రమ కేసులను విచారించి చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలోని ప్రధాన సమస్యలు, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టుకు నిధులు విరివిగా ఇవ్వాలని వినతిపత్రం అందించారు.

క్రమశిక్షణతో చదివితేనే ఉత్తీర్ణత



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూ హేమావతి

పలమనేరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఉత్తీర్ణత సాధ్యమని.. విద్యార్థులు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని పలమనేరు సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూ హేమావతి పేర్కొన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు విజయకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులకు మెలకువలను వివరించారు. జనవిజ్ఞానవేదిక అధ్యక్షులు గిరిధరమూర్తి, పలమనేరు, పెద్దపంజాణి, యాదమరి, బంగారుపాళ్యం మండలాల్లోని వసతిగృహ విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

సోమల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా సర్పంచుల మాజీ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు తెలిపారు. ఆదివారం చెన్నపట్నం చెరువు వద్ద నీటి సంఘ అధ్యక్షుడు బోస్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని భారీ నీటిపారుదల శాఖ మంత్రి రామానాయుడుకు విన్నవించామన్నారు. కట్ట వెడల్పు, సాగునీటి కాలువలకు మరమ్మత్తులు చేపట్టాలని కోరామని తెలిపారు. సమావేశంలో చంద్రశేఖర్ నాయుడు, సతీష్, శ్రీనివాసులు, ధనుంజయ, రాజేశ్వరనాయుడు, శివయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ ముఖ్య సలహాదారుడిగా మునీంద్రనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న మునీంద్రనాయక్

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ ముఖ్య సలహాదారుడిగా పుంగనూరు మండలానికి చెందిన మునీంద్రనాయక్‌ను ఎంపికయ్యారు. శనివారం గుంటూరులో జరిగిన ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన నియామకం జరిగింది. బంజారా కళాకారులకు రూ. 4 వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సంస్కృతి, సాంప్రదాయాలు, విద్య, ఉపాధి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

అభిమాన హీరో చిరంజీవిని కలిసిన శంకర్‌మహంతి

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తన అభిమాన హీరో మెగాస్టార్ చిరంజీవిని మొదటిసారిగా హైదరాబాద్‌లోని చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌లో కలిసినట్లు అన్‌స్టాపబుల్ ప్రోగాంలో పాల్గొన్న బంగారుపాళ్యం వాసి ఎంవీడీ మల్లేశ్వరావు (స్క్రీన్ నేమ్ శంకర్ మహంతి) ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీ చెక్‌పోస్ట్‌లో ఉన్న చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన రక్తదాతల ఆత్మీయసభకు తనను ఆహ్వానించినట్లు చెప్పారు. ఈ మేరకు తాను హైదరాబాద్ వెళ్లి ఆ సమావేశంలో పాల్గొన్నానని, 24 సార్లు రక్తదానం చేసినందుకు తనను చిరంజీవి సన్మానించినట్లు తెలిపారు. తన అభిమాన హీరో చిరంజీవిని కలవడం తన జీవితంలో మరిచిపోలేనని ఆయన చెప్పారు. తాను చేసిన రక్తదానం పుణ్యం వలన తన భార్యకు పుణ్యం లభించిందని అన్నారు. నా భార్య వెంకటదుర్గ ఆరోగ్యపరిస్థితిపై చిరంజీవి ఆరా తీశారన్నారు. తాను ఆయనకు రమణ మహర్షి జీవిత చరిత్ర, అరుణాచలేశ్వరుడి ఫొటోను అందజేసినట్లు ఆయన తెలిపారు. కాగా గత నెల 18వ తేదీన ఆంధ్రజ్యోతి పత్రికలో ఆహా అన్‌స్టాపబుల్ ప్రోగాంలో బంగారుపాళ్యం వాసి అని ప్రచురితమైన విషయం విదితమే.

వరసిద్ధుడిని దర్శించుకున్న ప్రభుత్వ విప్



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

గణితంపై విద్యార్థులకు భయం పోగొట్టాలి

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గణితం పట్ల విద్యార్థులకు భయం పోగొట్టడంతో పాటు ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు లెక్కల మాస్టర్లు, యాజమాన్యాలు కృషి చేయాలని ఏపీ మ్యాథ్స్ ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు అరుణశివప్రసాద్, విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి అన్నారు. జేవీవీ, ఆపుస్మా సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో ప్రైవేటు పాఠశాలల గణిత ఉపాధ్యాయులకు గణితంలో మెలకువలపై ఒక్క రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సూక్ష్మ ప్రణాళిక ద్వారా గణితంలో అత్యధిక మార్కులు సాధించే విధానాన్ని తెలియజేయాలన్నారు. సి, డి గ్రేడ్ విద్యార్థులకు సైతం గణితంలో సూత్రాలను నేర్పించి భయాన్ని పోగొట్టాలని, టవర్ ఆఫ్ హన్నాయ్ విధానం ద్వారా ఇది సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ సిద్ధరంగ పిళ్లై, ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు చంద్రమ నాయుడు, అపుస్మా కోశాధికారి కృష్ణయ్య, సుధాకర్, జయంతి, జవహర్‌లాల్, దుర్గాప్రసాద్, ప్రైవేటు పాఠశాలల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉర్దూ జేఏసీ అధ్యక్షులుగా మహమ్మద్‌ఆలీ

పలమనేరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా ఉర్దూ జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులుగా మహమ్మద్ ఆలీ, డాక్టర్ ఆర్.ఎస్. రహ్మతుల్లాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉర్దూ జేఏసీ జిల్లాశాఖ ఎన్నికలు జరిగాయి. కమిటీ గౌరవాధ్యక్షులుగా డాక్టర్ ఎండీ నకీ ఉల్లాఖాన్, ఉపాధ్యక్షులుగా మునీర్‌అహమ్మద్, అన్సర్ బాషా, కార్యదర్శిగా ఇలియాజ్, అదనపు కార్యదర్శిగా ఖాదర్‌బాషా, కన్వీనర్‌గా రబ్బాని, కో కన్వీనర్‌గా ముబారక్, నిర్వాహక కమిటీ సభ్యులుగా ముక్తార్ అహ్మద్, షంషీర్, సాలెహ ఎన్నికయ్యారు. అలాగే సలహామండలి సభ్యులుగా మహబూబ్‌బాషా, యాసిన్, మునాఫ్, కలందర్‌బాషా, యహసానుల్లా, సాజ్జుసాహెబ్, పఠాన్ మహమ్మద్‌ఖాన్ ఎన్నిక కాగా మహిళా విభాగ సభ్యులుగా జరీనాబేగం ఎన్నికయ్యారు.


15న బైరెడ్డిపల్లెలో గంగజాతర ప్రారంభం

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో ఈనెల 15, 16వ తేదీల్లో బాటగంగమ్మ జాతర వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. 15న రాత్రి అమ్మవారి గెరిగ ఊరేగింపు, 16న బాటగంగమ్మ ఆలయం వద్ద పూజలు, మొక్కుబడుల చెల్లింపు, అన్నదానం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదే రోజు మైలారు పండుగ నిర్వహించనున్నట్లు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చౌడేపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని యల్లకుంట్ల పంచాయతీ ఊటూరు బస్టాపు వద్ద రెడ్డెప్ప కుమారుడు చంద్రబాబు(35) మద్యం విక్రయిస్తుండగా అతడిని అరెస్టు చేసి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న శివప్రసాద్

కల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కల్లూరు-పీలేరు జాతీయ రహదారి దిగువపోకలవారిపల్లి బస్టాపు సమీపంలో శనివారం రాత్రి స్కూటర్‌ను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. కల్లూరుకి చెందిన శివప్రసాద్ (28) తన ద్విచక్రవాహనంపై పీలేరుకు వెళ్లి పనులు ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలోని దిగువపోకలవారిపల్లి బస్టాపు సమీపంలో కల్లూరు వైపు నుంచి పీలేరుకు వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో శివప్రసాద్‌కు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కల్లూరు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సదుం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సదుం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ షేక్ షావలి కథనం మేరకు.. మండల పరిధిలోని ఊటుపల్లె పంచాయతీ అంకాళమ్మ గుడి సమీపంలోని అటవీ శివారు ప్రాంతంలో ఓ వ్యక్తి తన లుంగీతో మెడకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం స్థానికులు పోలీసులకు తెలియజేయడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడికి 45-50 ఏళ్లలోపు వయస్సు ఉంటుందని.. ఆత్మహత్య చేసుకున్నాడా.. ఎవరైనా చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారా అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉందని తెలిపారు.

ట్రాక్టరు బోల్తాపడి డ్రైవర్ దుర్మరణం

గుడుపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలం పొగురుపల్లె సమీపంలోని మలుపులో ప్రమాదవశాత్తు ట్రాక్టరు అదుపు తప్పి బోల్తా పడటంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కర్ణాటక సరిహద్దు గ్రామం కాలువపల్లెకు చెందిన సుబ్బారెడ్డి అనే డ్రైవర్ ట్రాక్టరుపై ఆదివారం మధ్యాహ్నం తమ గ్రామం నుంచి గుడుపల్లె మండలం పొగురుపల్లెకు పయనమయ్యాడు. మార్గమధ్యలో పొగురుపల్లె క్రాస్ వద్ద ట్రాక్టరు అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో సుబ్బారెడ్డి ట్రాక్టరు ఇంజను కింద చిక్కుకుని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

105 మందికి ఉచిత వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రామకుప్పం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్ఆర్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, రామకుప్పం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 105మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్, మునిరత్నం, అభిరామి, తేజస్విని, ఆలయ నిర్వహణ కమిటీ పెద్దలు సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి తోట దగ్ధం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేలుందొడ్డి గ్రామ సమీపంలోని నీలగిరితోటకు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం నిప్పు పెట్టారు. తోట చుట్టుపక్కల ఉన్న రైతులు మంటలు గమనించి వెంటనే పుంగనూరు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసినట్లు ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. తోట సగభాగం కాలిపోవడంతో నష్టం జరిగినట్లు రైతు చక్రవర్తి తెలిపారు.

సోలార్ ఫెన్సింగ్‌కు వందశాతం రాయితీ ఇవ్వాలి



సీసీఎఫ్ చిరంజీవి చౌదరికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం జిల్లా నాయకుడు ఉమాపతి నాయుడు

పలమనేరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడులకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు పూర్తి ఫలితాలు ఇవ్వడం లేదని.. రైతులు తమ పొలాల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకునేందుకు వందశాతం సబ్సిడీని ప్రభుత్వం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సీసీఎఫ్ చిరంజీవినాయుడుకు జిల్లా రైతు సంఘం నాయకులు ఉమాపతినాయుడు వినతిపత్రం అందించారు. ఆదివారం పలమనేరు సమీపంలోని మొసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపును ప్రిన్సిపల్ సీసీఎఫ్ చిరంజీవిచౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన్ను కలిసి రైతుల సమస్యలపై విన్నవించారు. రైతులకు ఇస్తున్న నష్టపరిహారం కేవలం 10 శాతం ఉండటం లేదని.. రైతుల వ్యవసాయ పరికరాలు, పంపులు, పైపులు, మోటర్లకు ఏనుగుల దాడుల్లో దెబ్బతింటే నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. కొత్త జీవో మేరకు నష్టపరిహారాలు ఇవ్వాలని కోరారు.

సమాజంలో గురువులది ప్రత్యేక స్థానం



సన్మానం అందుకున్న గురువులు

గంగవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో గురువులది ప్రత్యేక స్థానమని.. గురువు స్థానానాకి ప్రత్యామ్నాయం లేదని రిటైర్డ్ ఆచార్య శంకరయ్య అన్నారు. ఆదివారం స్థానిక కళామందిరంలో గురువందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాధంనాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సామాజిక స్పృహ కలిగి ఉన్నప్పుడే విద్యార్థులు విలువలు పెంపొందించుకుంటారన్నారు. అనంతరం పలువురు తులసీనాధం నాయుడు దంపతులను పూలమాలలు, శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, స్పందన ఫౌండేషన్ శ్యామలమ్మ, రామచంద్ర, హరిప్రసాద్, రాజేంద్ర, మునికృష్ణ, జ్యోతి, మల్లీశ్వరి, లోకనాధం, శ్రీహరి, గారిబాబు, ధనమ్మలతోపాటు పలువురు పాల్గొన్నారు.

సంప్రదాయ పండుగల విశేషాలను తెలుసుకోవాలి



శివరాత్రి ప్రాముఖ్యతను తెలియజేస్తున్న త్రైత సిద్ధాంత సేవా సమితి సభ్యులు

గంగవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మన సంప్రదాయ పండుగలు, ప్రాముఖ్యతలను తెలుసుకోవడానికి కృషిచేయాలని త్రైత సిద్ధాంత భగవద్గీత సేవాసమితి అధ్యక్షులు భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం గంగవరం మండల పరిధిలోని ఉయ్యాలమిట్ట గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత సేవాసమితి సభ్యులు రథసప్తమి, శివరాత్రి పండుగల ఆవశ్యకతపై గ్రామంలో అవగాహన కల్పించారు. మాఘపూర్ణిమ భగవంతుని జన్మవిశేషాలను తెలియజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బంగారుపాళ్యం అధ్యక్షులు బాలాజీ, సభ్యులు రాజేంద్ర, ఉదయ్, రెడ్డెమ్మ, రేఖ, కళ్యాణి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రి వైద్యులచే ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యనిపుణులు 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 22 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో శంకర నేత్రాలయ వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాసులు, రమణ, గంగాధరం, చంద్ర, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో పేర్ల నమోదు

కుప్పం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఓ విశిష్ట గుర్తింపు సంఖ్య (రైతు డిజిటల్ గుర్తింపు కార్డు) ఇవ్వాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా ప్రతి రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో తమ పేర్లను ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నమోదు కార్యక్రమం సోమవారం నాటితో ప్రారంభమవుతుంది. ఈనెల 28 లోపు రైతులు తమ పేర్లను ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. రైతు సేవా కేంద్రానికి స్వయంగా వెళ్లలేని పక్షంలో సంబంధిత వ్యవసాయాధికారులకు ఫోన్‌లో వివరాలు చెప్పి ఓటీపీతో పేర్లను నమోదు చేసుకోవచ్చు.

విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రయోజనం

విశిష్ట గుర్తింపు సంఖ్యతోనే ఇకపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఏ పథకాలకైనా అర్హులు అవుతారు. పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీలు తదితర పథకాలకు విశిష్ట గుర్తింపు సంఖ్యలేని రైతులు ఇకపై అనర్హులవుతారు. దీంతో రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో పేర్లను నమోదు చేసుకుని విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని కుప్పం, గుడుపల్లె మండలాల వ్యవసాయాధికారులు ఫయాజ్ బాషా, నాగరాజు తెలిపారు.

●పుంగనూరు రూరల్: రైతు సేవా కేంద్రాల్లో రైతులు ఐడీ నెంబరు తీసుకుంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి అవకాశం ఉంటుందని పుంగనూరు ఏడీఏ శివకుమార్‌రాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ పొలాలు ఉన్న ప్రతి రైతు ఐడీ నంబరు తీసుకోవాలని.. వివరాలకు వ్యవసాయశాఖ కార్యాలయాలన్ని సంప్రదించాలని కోరారు.

●సోమల: సోమల మండలంలోని ప్రతి రైతు విధిగా డిజిటల్ గుర్తింపు కార్డులను పొందాలని ఏవో సుధాకర్ కోరారు. డిజిటల్ గుర్తింపు కార్డులుంటేనే రైతులకు పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్ట పరిహారం, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీలు, ప్రభుత్వ పథకాల లబ్ధి పొందగల్గుతారని తెలిపారు.

చెల్దిగానిపల్లె మీదుగా నాలుగులైన్ల రహదారొద్దు..!

● సగం ఊరు కనుమరుగవుతుందని గ్రామస్థుల ఆవేదన

రామకుప్పం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె మీదుగా నిర్మితం కానున్న పలమనేరు-కుప్పం నాలుగులైన్ల జాతీయ రహదారిని గ్రామం మీదుగా కాకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆ గ్రామస్థులు డిమాండు చేశారు. నాలుగు లైన్ల జాతీయ రహదారి ఏర్పాటు చేయడం తమకు ఆనందకరమేనని తెలిపారు. గ్రామంలో మొత్తం 140 ఇళ్లు ఉండగా జాతీయ రహదారి పక్కన 70 ఇళ్లు ఉన్నాయన్నారు. గ్రామం మీదుగా నాలుగు లైన్ల రహదారి ఏర్పాటు చేస్తే 70 ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని.. తరతరాలుగా గ్రామంలో కలసిమెలిసి ఉన్న కుటుంబాల వారు విడిపోయి దూరం కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకోవాలంటే అధిక వ్యయ, ప్రయాసలకు గురికావాల్సి వస్తుందన్నారు. అలాగే రాములవారి గుడితోపాటు గంగమ్మ ఆలయం కూల్చివేయాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు గుర్తించి గ్రామానికి దూరంగా నాలుగు లైన్ల బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరారు.

పుంగనూరు కవయిత్రులకు సన్మానం



పుంగనూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగిన జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రెండో సాహిత్య సాంస్కృతిక మహాసభల్లో పుంగనూరుకు చెందిన ఇద్దరు కవయిత్రులకు ఘన సన్మానం జరిగింది. ఆదివారం కడప శంకరాపురంలో జరిగిన సభలో వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం, రాయలసీమ భాగస్వామ్యం అనే అంశంపై పుంగనూరు కవయిత్రులు హసీనాబేగం, గాయిత్రీ దేవి కవితలు వినిపించారు. ప్రతిభను కనబరిచిన హసీనాబేగం, గాయిత్రీదేవిలను అధ్యక్షులు మల్లికార్జున, కార్యదర్శి జింక సుబ్రహ్మణ్యం శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.

కొల్లావారిపల్లెలో ఘనంగా పశువుల పండుగ

సోమల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కొల్లావారిపల్లెలో ఆదివారం పశువుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఇళ్ల ఎదుట ముగ్గులు వేసి గొబ్బెమ్మను తయారు చేసి తంగేడు పూలతో సుందరంగా అలంకరించి పూజలు చేశారు. పశువుల పాకలను సుందరంగా అలంకరించారు. పశువులకు స్నానాలు చేయించి ప్రత్యేక అలంకరణ చేశారు. పశువులకు పరుగు పందేలు నిర్వహించారు. యువకులు పశువులను నిలువరించడానికి పోటీలు పడ్డారు. విజేత కోడెగిత్తల యజమానులకు సోమల ఎస్ఐ శివశంకర్, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, బాలాజీ నాయుడు బహుమతులు అందించారు.



బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ శివశంకర్ తదితరులు

దేశమ్మ సేవలో ఎమ్మెల్యే భానుప్రకాష్



మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే

నగరి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని దేశమ్మ ఆలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా అమ్మవారికి సారె తీసుకెళ్లారు. స్థానిక కేవీపీఆర్‌పేటకు చెందిన టీడీపీ కార్యదర్శి శ్రీనివాసన్ బంధువు గణేశన్ ఏర్పాటు చేసిన పూజలో ఆయన పాల్గొనగా, కేరళ వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అర్చనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నగరి పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసన్, నాయకులు కృష్ణారెడ్డి, మదివాసన్, మాణిక్యవాసన్, నగరి మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, సురేష్ నాయుడు, వేణు, శ్రీనివాసులురెడ్డి, నారాయణస్వామి నాయుడు, జవహర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అభిమాన హీరో చిరంజీవిని కలిసిన శంకర్‌మహంతి



చిరంజీవికి జ్ఞాపికను అందజేస్తున్న శంకర్ మహంతి

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తన అభిమాన హీరో మెగాస్టార్ చిరంజీవిని మొదటిసారిగా హైదరాబాద్‌లోని చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌లో కలిసినట్లు అన్‌స్టాపబుల్ ప్రోగాంలో పాల్గొన్న బంగారుపాళ్యం వాసి ఎంవీడీ మల్లేశ్వరావు (స్ర్కీన్ నేమ్ శంకర్ మహంతి) ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీ చెక్‌పోస్ట్‌లో ఉన్న చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన రక్తదాతల ఆత్మీయసభకు తనను ఆహ్వానించినట్లు చెప్పారు. ఈ మేరకు తాను హైదరాబాద్ వెళ్లి ఆ సమావేశంలో పాల్గొన్నానని, 24 సార్లు రక్తదానం చేసినందుకు తనను చిరంజీవి సన్మానించినట్లు తెలిపారు. తన అభిమాన హీరో చిరంజీవిని కలవడం తన జీవితంలో మరిచిపోలేనని ఆయన చెప్పారు. తాను చేసిన రక్తదానం పుణ్యం వలన తన భార్యకు పుణ్యం లభించిందని అన్నారు. నా భార్య వెంకటదుర్గ ఆరోగ్యపరిస్థితిపై చిరంజీవి ఆరా తీశారన్నారు. తాను ఆయనకు రమణమహర్షి జీవిత చరిత్ర, అరుణాచలేశ్వరుడి ఫొటోను అందజేసినట్లు ఆయన తెలిపారు. కాగా గత నెల 18వ తేదీన ఆంధ్రజ్యోతి పత్రికలో ఆహా అన్‌స్టాపబుల్ ప్రోగాంలో బంగారుపాళ్యం వాసి అని ప్రచురితమైన విషయం విదితమే.

వరసిద్ధుడిని దర్శించుకున్న ప్రభుత్వ విప్



యార్లగడ్డ వెంకట్రావుకు జ్ఞాపికను అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్, ఇన్‌స్పెక్టర్

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గణితం పట్ల విద్యార్థులకు భయం పోగొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయం అధినేత తేజోమూర్తి

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గణితం పట్ల విద్యార్థులకు భయం పోగొట్టడంతో పాటు ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు లెక్కల మాస్టర్లు, యాజమాన్యాలు కృషి చేయాలని ఏపీ మ్యాథ్స్ ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు అరుణశివప్రసాద్, విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి అన్నారు. జేవీవీ, ఆపుస్మా సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో ప్రైవేటు పాఠశాలల గణిత ఉపాధ్యాయులకు గణితంలో మెలకువలపై ఒక్క రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సూక్ష్మ ప్రణాళిక ద్వారా గణితంలో అత్యధిక మార్కులు సాధించే విధానాన్ని తెలియజేయాలన్నారు. సి, డి గ్రేడ్ విద్యార్థులకు సైతం గణితంలో సూత్రాలను నేర్పించి భయాన్ని పోగొట్టాలని, టవర్ ఆఫ్ హన్నాయ్ విధానం ద్వారా ఇది సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ సిద్ధరంగ పిళ్లై, ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు చంద్రమనాయుడు, అపుస్మా కోశాధికారి కృష్ణయ్య, సుధాకర్, జయంతి, జవహర్‌లాల్, దుర్గాప్రసాద్, ప్రైవేటు పాఠశాలల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

యాదమరి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన యాదమరిలో పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పీఆర్టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి, మండల అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు జె.హిమబిందు ఆధ్వర్యంలో పీఆర్టీయూ జెండా ఆవిష్కరించి, కేక్ కట్‌చేసి ఉపాధ్యాయులకు పంచిపెట్టారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని సంఘ నాయకులు హామీయిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, తవణంపల్లె అధ్యక్ష, కార్యదర్శులు బాలచంద్రరెడ్డి, నరసింహారెడ్డి, సభ్యులు సురేష్‌రెడ్డి, విశ్వనాథ్, తులసి ప్రసాద్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

నగరి ఉపాధ్యాయుడికి బంగారు నంది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న చంద్రశేఖర్

నగరి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని ముడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ హైదరాబాదులో బంగారు నంది పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవాసంస్థ నిర్వాహకులు హైదరాబాదులోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించిన కవి సమ్మేళనంలో చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సమ్మేళనంలో కవితా గానం వినిపించినందుకు గాను ఆయనను జాతీయ బంగారు నంది పురస్కారంతో సత్కరించారు. ఇందుకు గాను అయన్ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎట్టకేలకు రామభద్రాపురానికి సీసీరోడ్డు



రామభద్రాపురం వద్ద జరుగుతున్న పనులు

గుడిపాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామభద్రాపురం గ్రామ సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చొరవతో స్థానిక సర్పంచ్ హరిణి హేమాద్రి నాయుడు రూ.12లక్షలతో సీసీ రోడ్డు వేయడానికి పనులు ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని ఈ రోడ్డు పనులు చేపట్టడంతో ఇటు గ్రామస్థులు, అటు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తర బ్రాహ్మణపల్లెలో పారిశుధ్య పనులు



పైపులైన్ల ఏర్పాటుకు జేసీబీతో గాడి తీస్తున్న దృశ్యం

తవణంపల్లె, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉత్తర బ్రాహ్మణపల్లెలో రోడ్డుపైనే మురుగునీరు అంటూ ఆంధ్రజ్యోతి గత మంగళవారం ప్రచురితమైన వార్తకు స్పందించిన అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టి మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా నూతన పైపులైన్లు ఏర్పాటు చేశారు. దీంతో దారిలో ప్రయాణించే భక్తులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతు డిజిటల్ గుర్తింపు కార్డును నమోదు చేసుకోండి

తవణంపల్లె, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇస్తున్న డిజిటల్ గుర్తింపు కార్డును ప్రతి రైతు నమోదు చేసుకోవాలని ఏవో ప్రవీణ్ కోరారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, లింకైన ఫోన్ నెంబరు తీసుకొని ఆయా సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకుల ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పంటల బీమా, పీఎం కిసాన్, పంట నష్ట పరిహార రాయితీలు గుర్తింపు కార్డు నమోదు చేసుకొన్న రైతులు మాత్రమే పొందడానికి అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

13న షబేబరాత్ పండుగ

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న షబేబరాత్ పండుగను జరుపుకోనున్నట్లు బంగారుపాళ్యం మండల ప్రభుత్వ ఖాజీ ఖజర్‌విప్తాహి ఖాసిమీ తెలిపారు. మరణించిన తమ పూర్వీకుల ఆత్మశాంతి కోసం ఈ పండుగను జరుపుకుంటామని, ఆ రోజు రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేస్తామని ఆయన చెప్పారు.

దళితులు ఐకమత్యంగా ఉండాలి

పూతలపట్టు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దళితులు ఐకమత్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని పలువురు దళిత నాయకులు అభిప్రాయపడ్డారు. పూతలపట్టు అంబేడ్కర్ భవనంలో ఆదివారం దళితుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏప్రిల్ 14న జరగనున్న అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు దళితులు రాజకీయాలకు అతీతంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు దళిత నాయకులు, అంబేడ్కర్ అభిమానులు పాల్గొన్నారు.

రేపు తైపూసం పూజలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న కాళభైరవ ట్రస్టు నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరింపేట చెంగల్‌రాయకొండ వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో కాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులచే తైపూసం పూజలు నిర్వహించనున్నట్లు ఆ ట్రస్టు వ్యవస్థాపకులు టి.వెంకటేషన్ తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మేరకు తైపూసం కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తులు పాలబిందెలతో వచ్చి వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకం, పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

మాజీ మంత్రికి సన్మానం

నిండ్ర, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఆర్కే రోజాను ఆదివారం ఆమె నివాసంలో ఇటీవల పదవులు లభించిన నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. నిండ్ర మండల వైసీపీ కన్వీనర్‌గా వేణురాజు మూడోసారి ఎన్నికయ్యారు. అదేవిధంగా నియోజకవర్గ రైతు విభాగ నాయకురాలిగా తోయాజాక్షి ఎన్నిక కావడంతో ఆమెను సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ మండలంలో వైసీపీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తామని అన్నారు.

భక్తి ప్రపత్తులతో మైలారు పండుగ



పూజల్లో పాల్గొన్న సి.కె.బాబు, సాయి కృష్ణారెడ్డి తదితరులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక రజక కాలనీలోని వీరభద్ర స్వామి ఆలయంలో ఆదివారం రజకులు తమ ఆరాధ్య దైవమైన వీరభద్ర స్వామి మైలారు పండుగను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సి.కె.బాబు, ఆయన తనయుడు సాయి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

అరకొరగా మామిడి పూత

- అధిక పూత కోసం రెండో పర్యాయం మందులు కొడుతున్న రైతులు



విజయపురంలో మామిడిలో పూత కోసం మందులు పిచికారి చేస్తున్న రైతులు



నారపరాజుకండ్రిగలో మామిడి పూత

విజయపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో మామిడి పూత అరకొరగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో వర్షం ఎక్కువగా కురవడంతో పాటు ప్రస్తుతం మంచు ఎక్కువగా పడుతుండటంతో మామిడిలో పూత తగ్గుతుంది. వచ్చిన పూత కూడా మగ్గిపోయి రాలిపోతుండటంతో ఈ ఏడాది కూడా మామిడి దిగుబడి తగ్గిపోతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విజయపురం మండలంలో సుమారు 750 హెక్టార్లు అనగా సుమారు 1850 ఎకరాల్లో మామిడి సాగుచేస్తున్నారు. జగన్నాథపురం, క్షూరికాపురం, విజయపురం, కోసలనగరం, జంబాడ, పాతార్కాడు, మహారాజపురం, మల్లారెడ్డి కండ్రిగ, శ్రీహరిపురం, నారపరాజుకండ్రిగ పంచాయతీలలో మామిడిని ఎక్కువగా సాగుచేస్తున్నారు. సాధారణంగా ప్రతి ఏటా డిసెంబరు, జనవరి నెలలో మామిడిపూత ప్రారంభమౌతుంది. ఈ ఏడాది పరిస్థితులు చూస్తుంటే ఫిబ్రవరి రెండవ వారానికి కూడా సగం పూత కూడా రాలేదని రైతులు వాపోతున్నారు.

రెండు, మూడు సార్లు మందులు పిచికారి చేసినా

మామిడిలో పూత తగ్గడంతో రెండు, మూడు సార్లు మందులు పిచికారి చేసినా ఫలితం కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు. ముందుగా మొగ్గ తొడగడానికి 13.0ఐ45(మల్టి-కె) 10 గ్రాములు, ఫార్ములా 4.2 గ్రాములు, క్లోరోఫైరిపాస్ 50 శాతం ఈసీ 2 మిల్లీలీటర్లు కలిపి చెట్టు మొత్తం మంచులా పడేలా పిచికారి చేయాలని ఉద్యాన శాఖాధికారులు సూచిస్తున్నారు. రెండోసారి మొగ్గతొడిగిన తరువాత బప్రోజిన్ 20 శాతం, ఎసిపేట్ 50 శాతం కాంబినేషన్‌లో ఉండే మందు ఒక గ్రాము, మాంకోజెబ్ 63 శాతం, కార్బెండజిం 12 శాతం, కాంబినేషన్‌లో ఉండే మందు 1.5 గ్రాములు, ఫార్ములా 4-2 గ్రాములు, గమ్ 0.5 మిల్లీలీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని పేర్కొంటున్నారు. అన్ని మందులు పిచికారి చేస్తున్నా పూత సక్రమంగా రాకపోవడంతో ఏమి చేయాలో తోచడం లేదని రైతులు వాపోతున్నారు.

పండు ఈగ బుట్టను సిద్ధం చేసుకోండి

ప్రతి మామిడి రైతు సస్యరక్షణలో భాగంగా పండు ఈగ బుట్టలు సిద్ధం చేసుకోవాలి. ఎకరాకు 10 నుంచి 12 బుట్టలు సరిపోతాయి. ఈ పండు ఈగలు కాయలకు రంధ్రం చేసి గుజ్జుని తినేస్తాయి. బుట్టలు ఏర్పాటు చేస్తే వాసనకు పండు ఈగలు బుట్టలో పడిపోతాయి. తద్వారా పంటను సంరక్షించుకోవచ్చు. కాయలకు కవర్లు కట్టడం వలన నాణ్యమైన దిగుబడి పొందవచ్చు. ఈ కవర్లు సబ్సిడీ కింద పొందాలంటే రైతు సేవా కేంద్రాల్లో దరకాస్తు చేసుకోవాలి.

- వెంకట సౌజన్య, ఉద్యాన అధికారి, పుత్తూరు

మంచుతోనే ఇబ్బంది



రెండు వారాల పాటు ప్రతి రోజూ మంచు తీవ్రత ఎక్కువగా ఉంది. దీంతో పూత మగ్గిపోయి రాలిపోతుంది. ప్రతి ఏడాది మామిడి రైతులు ఏదో ఒక విధంగా నష్టపోతూనే ఉన్నారు.

- కొండూరు ధాము, మామిడి రైతు, కేశవపురం

మామిడి రైతులను ఆదుకోవాలి



ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి. మామిడి రైతులకు సబ్సిడీ అందించడంతో పాటు, గిట్టుబాటు ధర కల్పించాలి. రైతుల నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

- సుధాకర్‌రాజు, మామిడి రైతు, నారవరాజుకండ్రిగ

మా రోడ్డుకు మోక్షం కల్పించండి...

- ముఖ్యమంత్రికి రాగిమానుపెంట సర్పంచి విజ్ఞప్తి



చంద్రబాబును కలిసిన సర్పంచి శ్రీహరి

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాగిమానుపెంట రోడ్డు నుంచి రాగిమానుపెంటకు వెళ్లే రహదారికి మోక్షం కల్పించాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును తాడేపల్లి గెస్ట్‌హౌస్‌లో శనివారం కలిసి విజ్ఞప్తి చేసినట్లు రాగిమానుపెంట సర్పంచి శ్రీహరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రహదారి గుంతలమయంగా మారిందని, ప్రయాణం చేయడం చాలా కష్టమవుతోందని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. తమ ప్రాంతం నుంచి సుమారు 30 గ్రామాల ప్రజలు, విద్యార్థులు నిత్యం మండల కేంద్రమైన బంగారుపాళ్యంకు వచ్చి వెళుతుంటారని, తమిళనాడు రాష్ట్రానికి ఇది లింక్ రోడ్డు కావడంతో కాణిపాకం దేవస్థానికి వెళ్లడానికి వాహనాలు వస్తుంటాయని చెప్పారు. రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణం నరకంగా మారిందని తెలిపారు. అదేవిధంగా అమరజవాన్ కార్తీక్ నివసించిన హౌసింగ్ కాలనీకి వీరజవాన్ కార్తీక్ కాలనీగా పేరు పెట్టినట్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళినట్లు ఆయన వివరించారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించిట్లు శ్రీహరి తెలిపారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణం



అమ్మవారి తాళిబొట్లను భక్తులకు చూపుతున్న అర్చకులు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ఆదివారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణుడి విగ్రహాలకు పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి, వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివార్ల కల్యాణాన్ని వీక్షించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతారిణి నాగలక్ష్మి హరికథ కాలక్షేపం చేయగా, వెంకటేశ్వర భక్తిగీతాలు, అన్నమయ్య కీర్తనలను రాజేష్ ఆలపించారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు

గుడిపాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, చిత్తూరు ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడునెలల వ్యవధిలో మండలంలో సుమారు రూ.14 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, గోకులం షెడ్లు, పానాటూరు రోడ్డులో నిర్మాణ పనులు జరుగుతుంటే వైసీపీ నాయకులు కళ్లు మూసుకొని నోటికి వచ్చినట్లుగా మాట్లాడడం సబబు కాదని హెచ్చరించారు. తమ ట్రస్టు ద్వారా నిరుపేదలను ఆదుకుంటున్నట్లు తెలిపారు. చంద్రబాబును విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు.

15న మహాకుంభాభిషేకం

గుడిపాల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పిగానిపల్లి గ్రామ సమీపంలో వెలసివున్న కందగిరి కొండలో ఈనెల 15వ తేదీన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ద్వితీయ కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 15న విఘ్నేశ్వర పూజతో మొదలై, 16న మూలస్థాన స్వామివారికి మహాకుంభాభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, 17న మండలాభిషేకం జరుగుతుందని చెప్పారు. భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



ఇళ్లత్తూరులో బాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భాను

విజయపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల మండలంలోని ఇళ్లత్తూరులో జరిగిన ప్రమాదంలో గాయపడిన బాబును ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం పరామర్శించారు. ఇళ్లత్తూరులో టీడీపీ సీనియర్ నాయకుడు మునిబాస్కర్‌రాజు తమ్ముడు సురేష్‌వర్మ కుమారుడు కేశఖండన కార్యక్రమంలో, శ్రీనివాసులు కుటుంబంలో జరిగిన ఫంక్షన్‌లో, పాత ఇళ్లత్తూరులో ఆర్ముగం కుటుంబాన్ని, ఇటీవల మృతి చెందిన వాసుదేవరాజు కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు వరదరాజులు, ఏలుమలై, బాబు, మణి, కొల్లాపురి, నారాయణరాజు, కపిల్, సాముఏలు, బెంజిమన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కనికలమ్మ ఆలయంలో విశేష పూజలు



భీమినేనిని సన్మానిస్తున్న గ్రామస్థులు

పాలసముద్రం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపాళ్యం అటవీ ప్రాంతంలో ఉన్న కనికలమ్మ ఆలయంలో ఆదివారం గ్రామస్థులు విశేష పూజలు నిర్వహించారు. రాచపాళ్యం నుంచి బెంగళూరు వెళ్లి వ్యాపార రీత్యా స్థిరపడిన వారంతా కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పూజలు నిర్వహించి పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడిని గ్రామస్థులు శాలువ కప్పి సన్మానించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా మాస నారాయణి సేవ



పేదలకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో ఆదివారం స్వామి వారికి మాస నారాయణి సేవ ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి గిరింపేట పుర వీధుల్లో పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం నగరంలోని పలు ప్రాంతాల్లో పేదలకు భోజన ప్యాకెట్లు అందజేశారు. సత్యసాయి సేవా సమితి, భజన మండలి, బాలవికాస్, మహిళా మండలి, యువజన విభాగాల ప్రతినిధులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్పెంటర్ల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ కార్పెంటర్ల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన వార్షిక క్యాలెండరును పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వృత్తి నిర్వహణ నిమిత్తం కార్పెంటర్ల కోసం తవణంపల్లెలో స్థలం కేటాయించాలని సంఘం అధ్యక్షుడు హేమచంద్ర, ఉపాధ్యక్షుడు నవీన్ ఆచారి ఎమ్మెల్యేను కోరారు. పరిశీలించి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సదుం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సదుం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ షేక్ షావలి కథనం మేరకు.. మండల పరిధిలోని ఊటుపల్లె పంచాయతీ అంకాళమ్మ గుడి సమీపంలోని అటవీ శివారు ప్రాంతంలో ఓ వ్యక్తి తన లుంగీతో మెడకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం స్థానికులు పోలీసులకు తెలియజేయడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడికి 45-50 ఏళ్లలోపు వయస్సు ఉంటుందని.. ఆత్మహత్య చేసుకున్నాడా.. ఎవరైనా చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారా అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉందని ఆయన తెలిపారు.

ట్రాక్టరు బోల్తాపడి డ్రైవర్ దుర్మరణం

గుడుపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలం పొగురుపల్లె సమీపంలోని మలుపులో ప్రమాదవశాత్తు ట్రాక్టరు అదుపు తప్పి బోల్తా పడటంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కర్ణాటక సరిహద్దు గ్రామం కాలువపల్లెకు చెందిన సుబ్బారెడ్డి అనే డ్రైవర్ ట్రాక్టరుపై ఆదివారం మధ్యాహ్నం తమ గ్రామం నుంచి గుడుపల్లె మండలం పొగురుపల్లెకు పయనమయ్యాడు. మార్గమధ్యంలో పొగురుపల్లె క్రాస్ వద్ద ట్రాక్టరు అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో సుబ్బారెడ్డి ట్రాక్టరు ఇంజను కింద చిక్కుకుని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.